17 నుంచి సెమిస్టర్ పరీక్షలు

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 3 : టీయూ పరిధిలోని పీజీ, ఇంటిగ్రేటెడ్ కోర్సులకు రెగ్యులర్, సెమిస్టర్ పరీక్షలు ఈనెల 17వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని పరీక్షల నియంత్రణాధికారిణి అరుణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ, ఎంకాం, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంఎస్సీ, ఎంబీఏ, ఎంసీఏ, పీజీ సెమిస్టర్ పరీక్షలు, 5 సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ కోర్సులు (ఐఎంబీఏ, ఏపీఈ, పీసీహెచ్) ఏడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. ఫిబ్రవరి 28 వరకు పరీక్షలు కొనసాగుతాయని, మరిన్ని వివరాల కోసం టయూ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

6,7వ తేదీల్లో రాష్ట్రస్థాయి అథ్లెటిక్ క్రీడాకారుల ఎంపిక

కంఠేశ్వర్, ఫిబ్రవరి 3 : అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 6,7వ తేదీల్లో నాగారంలోని రాజారాం స్టేడియంలో రాష్ట్రస్థాయి అథ్లెటిక్ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరాల రత్నాకర్, రాజాగౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ -8, 10, 12, 14 బాలబాలికలకు పోటీలు ఉంటాయని, ఆసక్తి ఉన్న అథ్లెట్లు ఫిబ్రవరి 5న సాయంత్రం 6 గంటల లోగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. గెలుపొందిన క్రీడాకారులను కొత్తగూడెంలో నిర్వహించే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌కు పంపుతామని పేర్కొన్నారు.

పోలీసు అధికారులకు అవగాహన సదస్సు

చట్టాలపై వివరిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ లక్ష్మీనర్సయ్య

వినాయక్‌నగర్, ఫిబ్రవరి 3 : రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వైజయంతి, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ లక్ష్మీనర్సయ్య ఆదేశాల మేరకు నిజామాబాద్ డివిజన్ పోలీసు అధికారులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బైసారపు రాజేశ్ గౌడ్, మహ్మద్ రహీ మొద్దీన్ జిల్లా కోర్టులో పొరహక్కుల రక్షణ చట్టం -1954, ప్రథమ సమాచార సేకరణ మొదలుకొని కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసే వరకు జరుగుతున్న లోపాల గురించి వివరించారు. సమావేశంలో డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ లక్ష్మీనర్సయ్య, ఏసీపీ కిరణ్‌కుమార్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ బంటు వసంత్, డివిజన్ సీఐలు, ఎస్సైలు, ఎక్సైజ్ ఆఫీసర్స్, లైసెనింగ్ ఆఫీసర్, కోర్టు డ్యూటీ ఆఫీసర్లు పాల్గొన్నారు.

సోషల్ ఫోరం ఆధ్వర్యంలో సోషల్ టాలెంట్ టెస్ట్

ఖలీల్‌వాడి, ఫిబ్రవరి 3 : జిల్లా సోషల్ ఫోరం ఆధ్వర్యంలో ఎస్సెస్సార్ డిగ్రీ కళాశాల కవితా కాంప్లెక్స్‌లో సోషల్ టాలెంట్ టెస్ట్‌ను శనివారం నిర్వహించారు. ఇంగ్లిష్ మీడియంలో హఫియా ఫిర్దోస్, బి.రేవంత్, జమేరిన్ కౌసర్, డి.రక్షిత, తెలుగు మీడియంలో నాగేశ్వరి, వి.సంధ్య, కె.సుషీల్, పి. వేదిక విజేతలుగా నిలిచారని ఫోరం ప్రతినిధి వెంకట్రాంరెడ్డి తెలిపారు. గెలుపొందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని, విద్యార్థులను డీఈవో దుర్గాప్రసాద్ అభినందించారు.

పురుగుల మందు తాగిన జీపీ కార్మికుడు మృతి

మాక్లూర్, ఫిబ్రవరి3: మండలంలోని చిక్లీ గ్రామ పంచాయతీలో సపాయి కార్మికుడిగా పని చేస్తున్న సాధువుల చిన్న సాయిలు (65) గురువారం రాత్రి కూల్‌డ్రింక్‌లో పురుగుల మందు కలుపుకొని తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఏఎస్సై నర్సయ్య తెలిపారు. ఏఎస్సై కథనం మేరకు.. సాయిలు భార్య అనారోగ్యంతో బాధపడుతోంది. మనస్తాపానికి గురైన ఆయన గురువారం రాత్రి బయట పురుగుల తాగి నిద్రిపోయాడు. శుక్రవారం అపస్మారక స్థితిలో ఉన్న ఆయనను స్థానికులు గమనించి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. మృతుడి భార్య సుశీల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు. మృతుడికి కొడుకు, కూతురు ఉన్నారు. సాయిలు అంత్యక్రియలకు గ్రామ పంచాయతీ తరపున రూ.10వేల ఆర్థిక సాయం అందజేసినట్లు కార్యదర్శి రాజేశ్ తెలిపారు.

'బంద్‌లో కార్మికులు పాల్గొనాలి'

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి3: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 16న దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు పాల్గొనాలని కార్మిక సంఘాల నాయకులు కోరారు. పట్టణంలోని ఐఎఫ్‌టీయూ భవనంలో శనివారం ఆ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసు, శివాజి విలేకరులతో మాట్లాడారు. బీజేపీ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీకి భిన్నంగా కార్మికులకు వ్యతిరేకంగా నాలుగు లేబర్ కోడ్లను తెచ్చారని, కార్మికుల ఉపాధిని కొల్లగొట్టారని అన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

శక్కర్‌నగర్, ఫిబ్రవరి3: బోధన్ పట్టణం శక్కర్‌నగర్‌లోని ఎం.అరుణా రాణి ఇంట్లో చోరీ జరిగినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. అరుణ రాణి తన బంధువు మృతి చెందగా కుటుంబ సభ్యులతో కలిసి మేడ్చల్‌కు ఈనెల 2న వెళ్లింది. శనివారం ఇంటికి వచ్చి చూడగా ఇంటివెనుక తలుపులు తెరిచి ఉన్నాయి. దుండగులు ఇంటివెనుక తలుపులు పగులగొట్టి బీరువాలోని రూ. 1.5లక్షల నగదు, రెండు తులాల బంగారు, ఎనిమిది తులాల వెండి ఆభరణాల తోపాటు, టీవీఎస్ ఎక్స్‌ఎల్ మోపెడ్‌ను కూడా ఎత్తుకెళ్లినట్లు అరుణరాణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వీరయ్య తెలిపారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

మాక్లూర్, ఫిబ్రవరి 3: 35వ జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు 2024 సందర్భంగా శనివారం కాకతీయ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ట్రాఫిక్ ఏసీపీ జి.నారాయణ హాజరై మాట్లాడారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రిన్సిపాల్ నారాయణ, వైస్‌ప్రిన్సిపాల్ సాయరెడ్డి పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్యశిబిరం

ఖలీల్‌వాడి, ఫిబ్రవరి 3 : నగరంలోని సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూర్, తెలంగాణ మల్టీ స్పెషాలిటీ డెంటల్ వైద్యశాల ఆధ్వర్యంలో దంత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యనిపుణుడు జమాల్‌పూర్ రాజశేఖర్ విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించి పేస్ట్‌లు అందజేశారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూర్ అధ్యక్ష, కార్యదర్శులు జీలకర్ర విజయానంద్, చింతల గంగాదాస్, పోగ్రాం చైర్మన్ అబ్బాయి లింబాద్రి, శిశు మందిర్ పాఠశాల హెచ్‌ఎం సరిత తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించాలి

జిల్లా జడ్జి సునీత కుంచాల

ఖలీల్‌వాడి, ఫిబ్రవరి 3: క్యాన్సర్ వ్యాధిని ప్రారంభదశలోనే గుర్తించాలని జిల్లా జడ్జి సునీత కుంచాల అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ దవాఖానలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా జడ్జి సునీత, జిల్లా న్యాయసేవాధికారి పద్మావతి పాల్గొని అవగాహన కల్పించారు. క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవాలని, కాలానుగుణంగా క్రమం తప్పకుండా అన్నిరకాల పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన చికిత్స పొంది వ్యాధిని జయించాలని సూచించారు. అడగ్గానే జిల్లా కోర్టు మహిళా ఉద్యోగులకు, జిల్లా ఫారెస్ట్ మహిళా ఉద్యోగులకు స్కానింగ్ పరీక్షలు ఏర్పాటు చేయడంపై డాక్టర్ ప్రతిమారాజ్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో దవాఖాన డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్లు సరస్వతీ, పూర్ణిమ, అనుపమ, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా జడ్జి సునీత కుంచాల

సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి3: జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఆర్మూర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి జస్వంత్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ దుర్గారెడ్డి శనివారం తెలిపారు. అండర్-14 రాష్ట్రస్థాయి బాలుర విభాగంలో ప్రతిభ చూపాడని తెలిపారు. ఈనెల 3వ నుంచి 7 వరకు ఛత్తీస్‌గడ్‌లో నిర్వహించనున్న పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఖలీల్‌వాడి, ఫిబ్రవరి 3 : నగరంలోని పలు ప్రాంతాల్లో నేడు (ఆదివారం) ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ తోట రాజశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిలక్‌గార్డెన్ సబ్‌స్టేషన్ డీ-2 సెక్షన్ పరిధిలో మరమ్మతుల కారణంగా రాష్ట్రపతి రోడ్డు, గాంధీచౌక్, నెహ్రూపార్క్, వీక్లీమార్కెట్, కసాబ్‌గల్లీ, విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వివరించారు.

విద్యార్థులకు 'గోరు ముద్ద'

రెంజల్, ఫిబ్రవరి 3: మండలంలోని నీలా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 80 మంది పదోతరగతి విద్యార్థులకు శనివారం లయన్స్ క్లబ్ అచన్‌పల్లి శాఖ తరపున అల్పాహారాన్ని అందించారు. 30న ప్రారంభమైన ప్రత్యేక తరగతుల్లో విద్యార్థులు నీరసం చెందకుండా 40 రోజులపాటు గోరు ముద్ద పేరుతో అల్పాహారం అందించేందుకు ముందుకు వచ్చిన లయన్స్ క్లబ్ ప్రతినిధులకు గ్రామం తరపున బీఆర్ఎస్ జిల్లా నాయకుడు రాఘవేందర్‌యాదవ్ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఇల్తేపు శంకర్, లయన్స్ ప్రతినిధులు సాంబిరెడ్డి, వెంకటేశ్వర్‌రావు, కొడాలి కిశోర్, చక్రవర్తి, గాంధీ, శ్రీనివాస్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్న ప్రతినిధులు

బకాయిలను త్వరగా వసూలు చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న నగర మేయర్ నీతూకిరణ్

ఖలీల్‌వాడి, ఫిబ్రవరి 3 : మున్సిపాలిటీకి రావాల్సిన బకాయిలను త్వరగా వసూలు చేయాలని మేయర్ దండు నీతూ కిరణ్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలోని తన చాంబర్‌లో మున్సిపల్ కమిషనర్‌తో కలిసి ట్రేడ్ లైసెన్స్, నీటి పన్ను వసూలుపై శనివారం సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ధీర్ఘకాలంగా పెండింగ్‌లో ట్రేడ్ లైసెన్స్, యూసర్ చార్జెస్, నీటి పన్ను వసూలుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజావసరాలను తీర్చడానికి చేపడుతున్న చర్యలను వివరించాలన్నారు. సమావేవంలో అసిస్టెంట్ కమిషనర్ అనిల్‌కుమార్, అకౌంట్ ఆఫీసర్ సుధాకర్, మున్సిపల్ ఇంజినీర్ మురళీ మనోహర్, సెక్రటరీ శ్రీపాద రామేశ్వరం, మేనేజర్ జనార్దన్, ఎంహెచ్‌వో సాజిద్‌అలీ, టౌన్ ప్లానింగ్ అధికారులు, డిప్యూటీ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

స్థోమత లేని ఖైదీల కేసులకు ఉచిత న్యాయసేవలు

మాట్లాడుతున్న లీగల్ హెడ్ న్యాయవాదులు

వినాయక్‌నగర్, ఫిబ్రవరి 3 : నిజామాబాద్ జిల్లా జైలును లీగల్ హెడ్ న్యాయవాదులు శనివారం సందర్శించారు. జైలులో ఉన్న ఖైదీలను ఉద్దేశించి చీఫ్ లీగల్ హెడ్ కౌన్సిల్ న్యాయవాది రాజ్‌కుమార్ సుబేదార్ మాట్లాడారు. న్యాయవాదిని పెట్టుకునే స్థోమత లేని ఖైదీల కేసులను లీగల్ హెడ్ వ్యవస్థ ఉచితంగా వ్యాదిస్తుందని తెలిపారు. ఇందుకు ఖైదీలు వివరాలతో కూడిన వినతిపత్రాన్ని జైలు ఉన్నత సిబ్బంది, న్యాయసేవా సంస్థ, న్యాయమూర్తికి అందజేయాల్సి ఉంటుందని తెలిపారు. న్యాయవాదులు, వారి నంబర్లతో ఏర్పాటు చేసిన ఫెస్సీని జైలు సూపరింటెండెండ్ ప్రమోద్, రాజశేఖర్‌కు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ హెడ్ ఉదయ్ కృష్ణ, అసిస్టెంట్ హెడ్ కౌన్సిల్ ప్రమోద్, శుభం పాల్గొన్నారు.

నేర విచారణలో జాగ్రత్తలు తీసుకోవాలి

శక్కర్‌నగర్, ఫిబ్రవరి 3: పోలీసులు నేర విచారణ, చార్జిషీట్లు వేసే విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, నేరస్తులకు శిక్ష పడేలా చూడాలని బోధన్ అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.శ్యాంరావు అన్నారు. శనివారం బోధన్ న్యాయస్థానం ప్రాంగణంలో పోలీసులకు చట్టాలపై ఆయన పలు సూచనలు చేశారు. మరో పబ్లిక్ ప్రాసిక్యూటర్ డాక్టర్ పల్నాటి సమ్మయ్య మాట్లాడారు. సమావేశంలో బోధన్ పట్టణ ఎస్సై దరివేముల పీటర్, బోధన్ న్యాయస్థానం అధికారులు సీహెచ్. లక్ష్మణ్, ఎన్. సాయన్న, కె.ప్రసాద్, డి.తుకారాం, డి.రాములు, బాఖర్ హుస్సేన్, టి.సాయన్న, కె.శంకర్, చంద్రశేఖర్, శ్రీదేవి అధికారులు పాల్గొన్నారు.

200 మందికి వైద్య పరీక్షలు

శక్కర్‌నగర్, ఫిబ్రవరి 3: బోధన్ పట్టణం సరస్వతీ నగర్‌లోని ట్రూలైఫ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో శనివారం వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని స్థానిక ఏసీపీ కేఎం కిరణ్‌కుమార్ ప్రారంభించారు. బోధన్ ఏసీపీ కిరణ్‌కుమార్‌తోపాటు, పట్టణ సీఐ బి.వీరయ్యకు వైద్యులు పరీక్షలు నిర్వహించారు. సుమారు రెండువందల మందికి వివిధ రకాల పరీక్షలు చేశారు.

పరీక్షలు చేయించుకుంటున్న బోధన్ ఏసీపీ కిరణ్‌కుమార్

జాతీయ పురస్కార గ్రహీతకు సన్మానం

రెంజల్, ఫిబ్రవరి3: జాతీయ పురస్కార గ్రహీత, చరిత్ర పరిశోధకుడు కందకుర్తి యాదవరావును శనివారం మండలంలోని నీలా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సన్మానించారు. కందకుర్తికి చెందిన యాదవరావుకు ఈ పురస్కారం లభించడం మండలానికే గర్వంగా ఉందని హెచ్‌ఎం ఇల్తేపు శంకర్ కొనియాడారు.

యాదవరావును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఉపాధి హామీ పనుల పరిశీలన

కందకాన్ని తవ్వుతున్న ఎంపీడీవో లక్ష్మణ్

ధర్పల్లి, ఫిబ్రవరి 3 : మండలంలోని ప్రాజెక్టు రామడుగులో ఉపాధిహామీ పనులను ఎంపీడీవో లక్ష్మణ్ శనివారం తనిఖీ చేశారు. ఎంపీడీవో సైతం గడ్డపారతో కందకాలు తవ్వి కూలీల్లో ఉత్సాహం నింపారు. గ్రామాల్లోని కూలీలందరికీ పని కల్పించాలని సూచించారు. అనంతరం ధర్పల్లి, రేకులపల్లిలోని వైకుంఠధామాలను పరిశీలించి, పరిసరాలను శుభ్రం చేయించారు. రేకులపల్లి వైకుంఠధామానికి విద్యుత్ సరఫరా కల్పించారు.

రైలు కింద పడి ఒకరి ఆత్మహత్య

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 3 : మండలకేంద్రంలోని రైల్వేగేటు సమీపంలో రైలు కింద పడి ఒకరు ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడిని మోతె గ్రామానికి చెందిన మంగలి కాశీరాం(35)గా గుర్తించినట్లు తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేవని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించామని తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

మోస్రా (చందూర్), ఫిబ్రవరి 3 : మోస్రా మండలంలోని గోపూర్ గ్రామశివారులో శనివారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్లు ఏఎస్సై నాగభూషణం తెలిపారు. నిజామాబాద్ నుంచి వర్నివెళ్లే దారిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల రోడ్డు వద్ద మృతదేహం లభ్యమైనట్టు తెలిపారు. గోపూర్ కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

జీపీ పాలకవర్గాలకు వీడ్కోలు

మోర్తాడ్/ బాల్కొండ/ సాలూరా/ నవీపేట/ బోధన్ రూరల్, ఫిబ్రవరి3: పదవీకాలం పూర్తయిన జీపీ పాలకవర్గాలను పలుచోట్ల గ్రామస్తులు శనివారం సన్మానించి వీడ్కోలు పలికారు. మోర్తాడ్ మండలం తిమ్మాపూర్ జీపీలో సర్పంచ్ గడ్డం చిన్నారెడ్డి, ఉపసర్పంచ్ నవీన్, వార్డుసభ్యులను సన్మానించారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలో నూతన జీపీ భవన నిర్మాణానికి, వివిధ అభివృద్ధి పనులకు కోట్లరూపాయలు మంజూరు చేసిన ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డికి ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. బాల్కొండ మండలంలోని చిట్టాపూర్ గ్రామపంచాయతీలో సర్పంచ్, ఉపసర్పంచ్ పాలకవర్గాన్ని స్పెషల్ ఆఫీసర్ రమణ, సెక్రటరి రేణుకాదేవి సన్మానించారు. వార్డు సభ్యులు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు. నవీపేట మండలంలోని మహంతం గ్రామ పంచాయతీ కార్యవర్గాన్ని ఎంపీపీ సంగెం శ్రీనివాస్, ప్రత్యేకాధికారి సయ్యద్ సాజీద్ అలీ సన్మానించారు. సర్పంచ్ మేకల రాజేశ్వర్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని గుర్తు చేశారు. మహంతం ఉప సర్పంచ్ పల్లికొండ పోశెట్టి మాట్లాడుతూ తాను గ్రామస్తులకు ఇచ్చిన హామీ ప్రచారం భూలక్ష్మి మందిరాన్ని సొంత డబ్బులు రూ. 10 లక్షల వ్యయంతో నిర్మించానని అన్నారు. డబ్బులు సరిపోకపోవడంతో తన భార్య పుస్తెల తాడు అమ్మి ఆలయం నిర్మించానని సన్మాన సభలో కంటి తడి పెట్టారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు నారాయణ, సాయిలు, రఘుపతి, అంజలి, లత, మాజీ సర్పంచ్ గంగాధర్ పాల్గొన్నారు. సాలూర సొసైటీ పరిధిలోని సాలూరా, పత్తేపూర్, తగ్గెల్లి, సాలూరా క్యాంప్ గ్రామాల సర్పంచులను విండో చైర్మన్ అల్లే జనార్దన్ సన్మానించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.



మహంతం జీపీ పాలకవర్గాన్ని సన్మానిస్తున్న ఎంపీపీ శ్రీనివాస్, ప్రత్యేక అధికారి సాజీద్ అలీ

తిమ్మాపూర్ మాజీ సర్పంచ్, వార్డుసభ్యులను సన్మానిస్తున్న గ్రామస్తులు

బాల్కొండలో ..

సాలూరాలో ..

కేటీఆర్ సమావేశానికి తరలిరావాలి

డిచ్‌పల్లిలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకులు

డిచ్‌పల్లి/ ధర్పల్లి/ ఇందల్వాయి, ఫిబ్రవరి 3 : డిచ్‌పల్లి మండలకేంద్రంలోని జీ-కన్వెన్షన్‌లో ఈనెల 5న నిర్వహించే రూరల్ నియోజకవర్గ బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని డిచ్‌పల్లి మండల సీనియర్ నాయకుడు దాసరి లక్ష్మీనర్సయ్య, శక్కరికొండ కృష్ణ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. విస్తృతస్థాయి సమావేశానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, శాసన మండలి సభ్యురాలు కల్వకుంట్ల కవిత, ఆర్టీసీ మాజీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ హాజరు కానున్నారని తెలిపారు. సర్పంచులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీ, గ్రామశాఖ అధ్యక్షులు, అనుబంధ శాఖల అధ్యక్షులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. సమావేశంలో నాయకులు ఒడ్డెం నర్సయ్య, మోహన్‌రెడ్డి, నల్లవెల్లి సాయిలు, హరికిషన్, విఠల్‌నాయక్, యూసుఫ్, చిన్నన్న, గూడాల లింగం, సతీశ్‌రెడ్డి పాల్గొన్నారు.

కేటీఆర్, కవిత సమావేశానికి బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చిలువేరి దాసు, ఎంపీపీ రమేశ్‌నాయక్ కోరారు. ఇందల్వాయిలో శనివారం విలేకరులతో మాట్లాడారు. ఈనెల 5న ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని తెలిపారు. సమావేశంలో డీసీఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్, వైస్ ఎంపీపీ అంజయ్య, పీఏసీఎస్ చైర్మన్ చింతలపల్లి గోవర్ధన్‌రెడ్డి, నాయకులు పాశం కుమార్, గడ్కోల్ శ్రీనివాస్, శెట్టి బీరీశ్, గంగాధర్, రాకేశ్ పాల్గొన్నారు.

జీ కన్వెన్షన్‌లో నిర్వహించే కేటీఆర్ సమావేశాన్ని విజయవంతం చేయాలని ధర్పల్లి ఎంపీపీ నల్ల సారికా హన్మంత్‌రెడ్డి ఒక ప్రకటనలో కోరారు.

రైతులకు నష్ట పరిహారం చెక్కుల అందజేత

వినాయక్‌నగర్, ఫిబ్రవరి 3 : నిజామాబాద్ అటవీ శాఖ ఆధ్వర్యంలో నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం చెక్కులను సౌత్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రవి మోహన్ భట్ శనివారం అందజేశారు. రూరల్ మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులకు సంబంధించిన ఆవులు చిరుతల దాడితో మృతి చెందడంతో బాధిత కుటుంబాలకు నష్టపరిహారం అందించినట్లు తెలిపారు. హనుమాన్ తండాకు చెందిన రైతు కొర్ర లచ్చీరాంకు రూ.30 వేలు, బానోత్ పూల్‌సింగ్ (అమ్రాద్ తండా)కు రూ.20 వేలు, భానోత్ రమేశ్ (మల్కాపూర్ తాండ)కు రూ.30 వేలు, బన్సీ పోతన్న (కాల్పోల్ తండా)కు రూ.30 వేల చెక్కులను అందజేసినట్లు వివరించారు.

సంక్షిప్తంగా..

- చందూర్, ఫిబ్రవరి 3 : మండలంలోని లక్ష్మాపూర్‌లో పల్లెప్రకృతివనం, వైకుంఠధామం, నర్సరీని ప్రత్యేక అధికారిణి, తహసీల్దార్ శాంత శనివారం పరిశీలించారు. నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శి నరేందర్‌కు సూచించారు.
- డిచ్‌పల్లి, ఫిబ్రవరి 3 : కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 16న దేశవ్యాప్త కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్‌బంద్ నిర్వహించనున్నట్లు గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్, ఐఎఫ్‌టీయూ ప్రతినిధులు తెలిపారు. బుధవారం వారు సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు.
- డిచ్‌పల్లి ఫిబ్రవరి 3 : వ్యవసాయ, ఉద్యాన వర్సిటీ భూములను హైకోర్టుకు కేటాయించవద్దని జీవో నంబర్ 55ను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు అంబటి నాగరాజు డిమాండ్ చేశారు. టీయూలో శనివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి ఈహైకోర్టుకు భూమి కేటాయింపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు.
- సారంగాపూర్, ఫిబ్రవరి 3 : నగర శివారులోని గూపన్‌పల్లిలో నిజామాబాద్ సీనియర్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఫోరం గౌరవ అధ్యక్షుడు రాంచందర్‌రెడ్డి దాతగా నిలవగా. 15 మందికి దుప్పట్లు పంపిణీ చేసినట్లు ఫోరం ప్రతినిధులు తెలిపారు.
- సిరికొండ, ఫిబ్రవరి 3 : మండలంలోని గోప్యాతండా, వర్జన్ తండా, మహిపాల్ తండా, హుస్సేన్‌నగర్ తండా, సర్నల్లి తండా గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలకు అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ సెంట్రల్ ట్యాక్స్ జరుపుల గోవింద్ శనివారం బెంచీలను వితరణ చేశారు. అంబేద్కర్ స్ఫూర్తితో పే బ్యాక్ టు ది సొసైటీ నినాదంతో సమాజానికి సేవ చేస్తున్నట్లు తెలిపారు. ఏంఈవో శ్రీనివాస్ దాతను సన్మానించారు.
- ఖలీల్‌వాడి, ఫిబ్రవరి 3 : బీసీల డిమాండ్ల సాధన కోసం ఈనెల 8న చలో